క్లుప్తంగా

శిక్షా సప్తాహ్ కార్యక్రమం ప్రారంభం


సైన్సు చిత్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం 4వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని నన్నూరు జడ్పీహైస్కూల్‌లో అట్టహాసంగా 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం ప్రాణేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొదటి రోజు ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై దేశవ్యాప్తంగా విద్యా అభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు : మండలంలోని కౌలు రైతులు కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు 1400 మంది రైతులకు గాను, ఇప్పటి వరకు కేవలం 392 మంది రైతులు మాత్రమే కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీటి నన్నింటినీ ఆన్‌లైన్ చేసి, అర్హత సాధించిన రైతులకు కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఇంకా దరఖాస్తు చేసుకోని రైతులు ఈ నెలాఖరులోగా చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

బదిలీ తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ అనుపమను సన్మానిస్తున్న అధికారులు

సి.బెళగల్: అనంతపురం జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ అనుపమను మండల అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్ తదితరులు ఆమెకు పూలమాలలు వేసి సత్కరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్, ఎంఈఓ ఆదామ్‌బాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ


సి.బెళగల్ కోటా స్కూల్‌లో కూలిన ప్రహరీ

సి.బెళగల్: మండల కేంద్రంలోని కోట ప్రాథమిక పాఠశాల ప్రహరీ వర్షాలకు కూలినట్లు పాఠశాల హెచ్‌ఎం రాధాకుమారి తెలిపారు. రెండు రోజుల పాటు మోస్తరు వర్షం కురవడంతో పాఠశాల ప్రహరీ సోమవారం ఉదయం కుప్పకూలిందన్నారు. ఆ సమయంలో అటుగా విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, విషయాన్ని మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

సృజనాత్మకత పెంచేలా బోధన చేయాలి


పాఠశాలలో స్థానిక వనరులతో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

కల్లూరు : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేలా బోధన చేయాలని ఎంఈఓ–2 వనజ కుమారి అన్నారు. సోమవారం సమగ్ర శిక్షా కింద పాఠశాలలో చేపట్టిన శిక్షా సప్తాహ్ ప్రత్యేక కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బోధన ద్వారా పిల్లల అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపర్చాలన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర శిక్షా కింద పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఈ నెల 28వ వరకు కొనసాగుతుందని చెప్పారు. సోమవారం పాఠశాలలో స్థానిక వనరులతో బోధన సామాగ్రి ప్రదర్శన నిర్వహించారు.

ఇళ్ల పట్టాల సమస్యలపై వినతి

సి.బెళగల్: మండలంలోని కంబదహాల్ గ్రామంలో ఎస్సీలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు తహసీల్దార్ అనుమను కోరారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని సర్వే నెంబర్ 155/2ఏ, 164/1ఏలో ఇచ్చిన ఇళ్ల పట్టాలపై విచారించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..?

- నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలు
- సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించిన టీడీపీ
- అధికారంలోకి వచ్చి నెల దాటినా ఎలాంటి ప్రకటన చేయని వైనం
- సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రస్తావించేనా?


సి.బెళగల్‌లో అధ్వానంగా ఉన్న రహదారి


ఆగిపోయిన కోడుమూరు-గూడూరు రోడ్డు నిర్మాణ పనులు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. నియోజకవర్గంలో చాలా మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలెన్నో ఉన్నాయి. గతంలో ఎన్నో సమస్యలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపినా ఇంకా పలు సమస్యలు మిగిలే ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ సమస్యలను ఎంత మాత్రం పరిష్కరిస్తుందోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు. కోడుమూరు ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి బొగ్గుల దస్తగిరి వ్యవహరిస్తున్నారు. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న ఏపీ అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ఏ మాత్రం ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కోడుమూరు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు

- శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి జీడీపీ నుంచి పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం.
- కోడుమూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఆయకట్టుకు ఎల్ఎల్‌సీ నుంచి నీటి వాటా సక్రమంగా రాబట్టి రైతుల సాగునీటి కష్టాలను తొలగించడం.
- కోడుమూరు మండలం గోరంట్ల హంద్రీనదిపై రూ.23కోట్లతో నిర్మిస్తున్న గోరంట్ల–కొత్తపల్లె బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయడం.
- కోడుమూరు, గూడూరు మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత చదువులు అందుబాటులోకి తేవడం.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.6.70 కోట్లతో కోడుమూరు–గూడూరు రహదారి నిర్మాణం చేపట్టగా, ప్రస్తుతం 50శాతం పనులు పూర్తయ్యాయి. త్వరగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయడం.
- గూడూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు సుంకేసుల నుంచి గూడూరు తాగునీటి పైపులైన్ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాల వాటర్ స్కీం కింద రూ.53 కోట్లు కేటాయించి చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోయాయి. వాటిని పూర్తి చేసి ప్రజలకు తాగునీరందించడం.
- సి.బెళగల్ మండలంలో నదీతీర గ్రామాలకు రోడ్డు సౌకర్యం. మధ్యలో ఆగిపోయిన కొత్తకోట– తిమ్మందొడ్డి రోడ్డు పనులను పూర్తి చేయాలి. నది నీటిని ఫిల్టర్ చేసి, శుద్ధ జలాన్ని అందించే ఏర్పాట్లు చేయాలి.
- సి.బెళగల్ మండలంలో బాలికలకు ప్రత్యేక ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రత్యేక హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- సి.బెళగల్ గురుకుల పాఠశాలలో మధ్యలో ఆగిపోయిన మినీ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలి.
- కె.సింగవరం, గుండ్రేవుల ఎత్తిపోతల పథకాల మోటర్లకు మరమ్మతులు చేసి రైతులకు సక్రమంగా సాగునీటిని అందించాలి.
- కర్నూలు మండలంలోని సుంకేసుల, జి.సింగవరం, నిడ్జూరు, బి.తాండ్రపాడు, దిన్నె దేవరపాడు గ్రామాల ప్రజలకు గత ప్రభుత్వాలు ఇళ్ల పట్టాలను ఇచ్చి నేటికి వాటికి స్థలాలు చూపలేదు. స్థలాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.
- కర్నూలు మండలంలోని దిన్నెదేవరపాడు గ్రామానికి శ్మశాన వాటిక నిర్మాణం.

పనులు పూర్తయ్యేనా?

పాణ్యం: ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక ఓట్లున్న నియోజకవర్గం పాణ్యం. విస్తీర్ణంలోనూ, జనాభాలో, ఓట్లలోనే పాణ్యం మొదటి స్థానంలో ఉంది. అలాంటి నియోజకవర్గంలో సమస్యలు అంతేస్థాయిలో ఉన్నాయి. ఎన్నికల ముందు కూటమి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అయితే పథకాల అమలులో తర్జనభర్జన పడుతున్న ప్రభుత్వం హామీలకు అనుగుణంగా సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో గళం వినిపించి సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతారా అని ఎదురుచూస్తున్నారు.

పాణ్యం మండలంలో పూర్తి చేయాల్సిన పనులు..

- సీమకు తలమానికమైన గోరుకల్లు జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 12.44 టీఎంసీలు. ఇంకా ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదు. ఇంతలోనే కట్ట కుంగిపోతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే తాగు, సాగు, నీటికి ఇబ్బందులు ఉండవు. ప్రాజెక్టుకు అదనంగా రూ. 100కోట్లతో ప్రతిపాదనలు పంపారు.
- పెండింగ్‌లో గాలేరు నగరి సుజల స్రవంతి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ లైనింగ్ పనులు పూర్తి చేస్తే కాల్వలో 30వేల క్యూసెక్కుల నీరు పంపవచ్చు.
- తమ్మరాజుపల్లె గ్రామవాసుల చిరకాల కోరిక అయిన ఏటిపాయ చెక్‌డ్యామ్‌కు గత ప్రభుత్వం రూ. 3కోట్లకు ప్రతిపాదలు పంపారు. ఈ చెక్‌డ్యామ్ పూర్తి చేస్తే గ్రామానికి తాగు, సాగునీటికి ఇబ్బందుల ఉండవు.
- గాలేరు నుంచి కొచ్చేరువులోకి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని పంపింగ్ చేయాలని గతంలో అధికారులు డిజైన్ చేసి ప్రతిపాదించారు.
- పాణ్యం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు, పరిశ్రమలు ఉన్నాయి.

కల్లూరు మండలం..

- మండలంలోని అర్బన్ 16 వార్డులో రెండ్రోజులకు ఓ సారి తాగునీరు వస్తాయి ప్రతి రోజు తాగు నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.
- ఉలిందకొండ పెద్ద, చిన్న చెరువులను హంద్రీనీవా నుంచి నీటిని అందించాలి.
- ఇంటర్ విద్య కోసం విద్యార్థులు సుమారు 20కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని, ఉలిందకొండలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- ఉలిందకొండ–యాపర్లపాడు రోడ్డు పూర్తి చేయాలి.

గడివేముల మండలం

- కుంగిన అలగనూరు రిజర్వాయర్ కట్ట పనులు చేపట్టాలి. కట్ట పనులు పూర్తి చేస్తే రిజర్వాయర్‌లో 3 టీంసీల నీరు నిల్వ చేసుకోవచ్చు.
- వెలగామ్ డ్యామ్ పనులు పూర్తి చేస్తే డ్యామ్ కింద సాగు చేసే 8వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతాయి.
- జిందాల్ సిమెంట్ పరిశ్రమ వలన నిత్యం భారీ వాహనాలు గడివేముల పట్టణంలో నుంచి వెళ్తుంటాయి. దీంతో భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బైపాస్ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
- సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన గని ప్రజలకు పునరావాసం కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


కుంగిన గోరుకల్లు జలాశయం కట్ట

ఓర్వకల్లు మండలం

- ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల హబ్‌గా ఓర్వకల్లు మండలాన్ని పిలుస్తారు. అలాంటి మండలంలో నెలకోల్పే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అసెంబ్లీలో ప్రస్తావించాలి.
- శకునాల సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులకు ఇంకా పూర్తి స్థాయిలో పరిహారం అందలేదు. పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బాధితులు కోరుతున్నారు.
- మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణం కొరకు గత ప్రభుత్వం డీపీఆర్ తయరుచేసింది. ప్రాజెక్టు నిర్మించి ప్రజల తాగు, సాగునీటి కష్టాలు తొలగించాలని ఐదు మండలాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.
- జయరాజ్ ఇస్పాత్‌కు ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి నీటిని తరలించే గ్రామాలకు తాగునీరు అందించాలని ఆయా ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలి



కోడుమూరు నుంచి గూడూరుకు సరైన రోడ్డులేక 30 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో నిధులను విడుదల చేసి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఎన్నికలు రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించి ప్రజల ఇబ్బందులను తీర్చాలి.

–వెంకటేశ్వర్లు, గూడూరు

నీటి సమస్యను పరిష్కరించాలి



గూడూరు పేరుకే నగర పంచాయతీ. పట్టణంలో తాగునీటి కోసం ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు సుంకేసుల నుంచి గూడూరుకు మంచినీటి పైపులైన్ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాల వాటర్ స్కీం కింద రూ.53 కోట్లను కేటాయించి చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోయాయి. వాటిని పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందించాలి.

–వీరక్రిష్ణ గౌడ్, గూడూరు

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



మా ఊరికి వెళ్లే రోడ్డంతా గుంతల మయంగా మారి ప్రయాణాలు చేయలేని విధంగా ఉంది. ఎంతో మంది అధికారులు, నేతలకు మా ఊరి రోడ్డు సమస్యను చెబుతున్నా అదిగో ఇదిగో అన్నారే తప్ప పరిష్కరించలేదు. ప్రస్తుతం గెలుపొందిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రోడ్డు నిర్మాణాని కృషి చేయాలి.

–రఘు, పలుకుదొడ్డి, సి.బెళగల్ మండలం

పెట్టుబడి సాయం అందించాలి



కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయం రూ.20వేలు ఇస్తామని చెప్పారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఇప్పటి వరకు రైతులకు ఎలాంటి సహాయం చేయలేదు. మండలంలో చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు నింపాలి. గ్రామాల్లో డ్రైనేజీలు, రోడ్లు నిర్మాణం చేపట్టాలి. బస్తిపాడు పోలిమేరలోని చిన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌ను నీటితో నింపి పంట కాలువలు ఏర్పాటు చేయాలి. – కె.మధు, సీపీఎం మండల కార్యదర్శి, కల్లూరు

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి



మండలంలో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలి. మండలంలో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలి. శకునాల సోలార్ పరిశ్రమల్లో భూములు కోల్పొయి కోర్టు వివాదంలో వున్న భూములకు తక్షణమే పరిహారం అందజేయాలి. అలాగే ఉద్యోగానికి గరిష్ట వయస్సు 45 ఏళ్లు పెంచి, ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన వారికి నిరుద్యోగ భృతి చెల్లించాలి.

– చేట్ల కిషర్, నిరుద్యోగి, ఓర్వకల్లు

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి



మండలంలో ప్రధానంగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు, వివిధ గ్రామాల మీదుగా పైపులైన్ ద్వారా సరఫారా చేస్తున్న నీటిని ఆయా గ్రామాల ప్రజలకు అవసరాలకు వాడుకునే వీలు కల్పించాలి. మిడుతూరు, ఓర్వకల్లు మధ్య ప్రతిపాదనలో వున్న మల్లికార్జున రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలి. ఓర్వకల్లు, కల్లూరు మండలాల మధ్య గల పురాతనమైన భయన్న చెరువును అభివృద్ధి చేయాలి. తద్వారా కొన్నివేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం వుంది.

– మంగళి వెంకటేశ్వర్లు, రైతు, ఓర్వకల్లు

సారా స్థావరాలపై సెబ్ దాడులు

- 950 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని క్రిష్ణగిరి మండలం చిట్యాల పరిసర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీలపై సెబ్ సీఐ రామాంజినేయులు ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 950 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ.. సెబ్ పరిధిలోని గ్రామాల్లో అక్రమంగా మద్యం రవాణా చేసినా, సారా తయారీ చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి వారి సమాచారాన్ని తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. దాడుల్లో కోడుమూరు సెబ్ ఎస్ఐ ఆలీబేగ్, సిబ్బంది హనుమంతు, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ ఉన్నారు.


గంగమ్మ శిలలను ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా గంగమ్మ జాతర

పాణ్యం: మండల పరిధిలోని వడ్డుగండ్ల గ్రామంలో గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం అమ్మవారి శిలల ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం కౌలురు గ్రామం నుంచి భక్తులు అమ్మవారి శిలలు, ఒంటికొమ్ము, బొల్లపు తీసుకొని బయలు దేరి బలపనూరు, రసూళ్లపేట, వడ్డుగండ్ల గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించిన అనంతరం సోమవారం కౌలురు గ్రామానికి పయనమయ్యారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు, బావులు నిండాలని ఆకాంక్షిస్తూ ప్రతి మూడు సంవత్సరాలకో సారి ఈ గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఊరేగింపులో ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

పాణ్యం : షార్ట్ సర్క్యూట్‌కు గురై గాయాలపాలైన పోల్‌టూపోల్ ఉద్యోగి శ్రీనివాసులు కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐఎఫ్‌బీ, ఎస్పీ, ఆర్వీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పాణ్యం తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఓజ శ్రీనివాసులు పని చేస్తున్నారన్నారు. సకాలంలో ఎల్‌సీ ఇవ్వకుండా సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఈ పుల్లయ్యపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే శ్రీనివాసులుకు మెరుగైన చికిత్స కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ రాష్ట్ర నాయకుడు రాజునాయుడు, ఎస్పీ జిల్లా అధ్యక్షుడు శివక్రిష్ణయాదవ్, ఆర్‌వీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, రవింద్రానాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కల్లూరు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఎ. గోకులపాడు, బస్తిపాడు, తడకనపల్లె, పెద్దపాడు గ్రామ సచివాయాల్లో, 24న కె.మార్కాపురం, బొల్లవరం, కొంగనపాడు, పందిపాడు, 25న సల్కాపురం, పుసులూరు, నాయకల్లు, లక్ష్మీపురం–1, 26న పర్ల–1, పెద్దటేకూరు, ఉలిందకొండ–1, లక్ష్మీపురం–2, 27న పర్ల–2, చిన్నటేకూరు, ఉలిందకొండ–2 సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫ్లోరోసిస్ బాధితులకు కర్రల పంపిణీ


చేతి కర్రలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు : మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న బాధితులకు కర్రలను పంపిణీ చేశారు. సోమవారం జాతీయ ఫ్లోరోసిస్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎంపీహెచ్ఈఓ విలియం రాబర్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీఓ మల్లీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా కాచిచాల్లర్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఒకవేళ అతిసార లక్షణాలు కలిపిస్తే ఓఆర్ఎస్ తాగాలన్నారు. అలాగే సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ రాబర్ట్ మాట్లాడుతూ.. మనం నిత్యం తాగే నీటిలో ఫ్లోరోసిస్ శాతం 1.5 పీపీఎం/ లీటర్ కంటే అధికంగా ఉంటే ఫ్లోరోసిస్ వ్యాధికి గురవుతారని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారిలో దంతాలు, ఎముకలు బలహీనం అవుతాయని చెప్పారు. ఈ వ్యాధి నివారణ కోసం కాల్షియం, విటమిన్–సి, ఐరన్ అధికంగా వుండే ఆకుకూరలు, పండ్లు తినాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సలీమ్‌బాషా, ఆరోగ్య కార్యకర్త స్వామి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్ఎం కిషోర్‌కుమార్

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ ఆదామ్‌బాషా అన్నారు. సోమవారం ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న జాతీయ విద్యా విధానాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమ నిర్వహణపై హెచ్ఎంలకు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. మొదటి రోజు సోమవారం సి.బెళగల్‌లోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కిషోర్‌కుమార్ టీచర్లతో కలిసి శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అభ్యసన సామగ్రిని ప్రదర్శణగా ఉంచారు. విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా విధానాలను తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత

కల్లూరు : వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి డాక్టర్ హేమలత సూచించారు. సోమవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామాజిక ఆరోగ్య అధికారులు, సచివాలయ మహిళా ఆరోగ్య కార్యకర్తతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ భోజనానికి ముందు, మాలవిసర్జన తరువాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇంటిని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చైతన్యవంతులు చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, ఎంపీహెచ్ఈఓ విజయ్‌కుమార్, సూపర్ వైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ సూచించారు. సోమవారం కోడుమూరులోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. నీటి కలుషితం–దోమల వల్ల కలిగే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలలు, వసతి గృహాల్లో సిబ్బందితో దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నీటి కలుషితం వల్ల డయేరియా ప్రబలుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే ప్రజలు తాగాలన్నారు. ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కోడుమూరు వైద్యాధికారి మదన్‌శేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రంగస్వామి, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్, ప్రిన్సిపాళ్ల ఆశాజ్యోతి, గౌసియాబేగం పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్